క్లుప్తంగా

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

కోటపల్లి: కోటపల్లి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30కేజీల బ్యాగు పూర్తి ధర రూ.2790, సబ్సిడీ పోను రూ.1116 రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జీలుగ వాడకం వల్ల రసాయనిక ఎరువైన యూరియా వాడకం తగ్గించవచ్చన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్, పట్టాపాస్ పుస్తకంతో క్లస్టర్ ఏఈవోను సంప్రదించాలని తెలిపారు.

కార్పొరేట్ కాలేజీలో ఉచిత విద్యకు ఎంపిక


చరణ్‌తేజ

నస్పూర్: పట్టణ పరిధిలో తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి సిలువేరి చరణ్‌తేజ పదో తరగతి ఫలితాలలో 10/10 జీపీఏ సాధించిండంతో అతడు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న శనివారం తెలిపారు. మేధ ట్రస్టు ద్వారా ఫ్రీ ఆఫ్ కాస్ట్ స్కీంలో విద్యార్థి సెలక్ట్ అయ్యాడని హెచ్ఎం పేర్కొన్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని శ్రీ హరిహర కళాభవన్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చరణ్‌తేజ ప్రతిభా పురస్కారం అందుకోనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

ఈశ్వరమ్మకు కోదండరాం నివాళి


కోదండరాంకు పుస్తకం అందిస్తున్న రవీందర్

మందమర్రిరూరల్: తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్థానిక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు హనుమాండ్ల రవీందర్ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాం శనివారం మందమర్రిలోని రవీందర్ ఇంటికి వచ్చి కుటుంబాన్ని పరామర్శించారు. ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రవీందర్ తన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా రాసిన సముద్రమంత మనుషులు అనే పుస్తకాన్ని అందించారు.

రాముని చెరువును కాపాడాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రామునిచెరువు కట్టను అక్రమదారుల నుంచి కాపాడాలని, వర్షాకాలానికి ముందే చెరువులో దుర్గంధపూరిత వాసన వెదజల్లుతున్న మురుగు నీటిని బయటకు ఎత్తిపోయాలని రాముని చెరువు వాకర్ అసోసియేసన్ సభ్యులు శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, డివిజనల్ ఇంజనీర్ మధుకర్‌లను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, కట్టపైన మంచినీటి సౌకర్యం, పోచమ్మ గుడి మూలమలుపు వద్ద నూతనంగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని, రూ.3.5కోట్లతో చేపట్టిన రాముని చెరువు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సభ్యులు రామ్‌రెడ్డి, విజయ్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

మహిళల సామూహిక రుద్రాభిషేకం


రుద్రాభిషేకం చేస్తున్న మహిళలు

జన్నారం: శివుని జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం జన్నారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మహిళలు సామూహిక రుద్రాభిషేకం చేశారు. పూజారి గణేశ్‌శర్మ ఆధ్వర్యంలో సుమారుగా 30మంది మహిళలు శివలింగానికి పూలు, పత్రి ఆకులతో, పాలు, నెయ్యి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆవుల శివీణ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల హెచ్ఎం చిన నర్సయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీ సురేందర్ పాఠశాల వద్ద శనివారం అభినందించారు.

మస్తు పిరమైనయ్..!

- ఎండ తీవ్రతతో పోటీ పడుతున్న కూరగాయల ధరలు
- పెరుగుదలే కాని తగ్గుదల లేని వైనం
- కిలోకు కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.35 వరకు ధర పెరుగుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పడిపోయిన కూరగాయల ఉత్పత్తి


బెల్లంపల్లి మార్కెట్లో అమ్మకానికి ఉంచిన కూరగాయలు

బెల్లంపల్లి: వేసవి తీవ్రతతో కూరగాయల ధరలు పోటీ పడుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాకొద్దీ కూరగాయల ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో ప్రధానమైన కూరగాయల ధరలు కిలోకు కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.35 వరకు పెరిగాయి. రోజువారీగా కూరగాయల ధరలు నిలకడగా లేకపోవడంతో పేద, సామాన్యులు పెరుగుతున్న ధరలతో పోటీపడలేకపోతున్నారు. మరీ ముఖ్యంగా రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కూలీల్లో కొనుగోలు శక్తి పడిపోతోంది. ఈ పరిస్థితుల్లో ధరలు తగ్గుముఖం పట్టే వరకు పచ్చడితోనే రోజులను వెల్లదీసే ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పడిపోతున్న కూరగాయల సాగు...

చుట్టుపక్కల ఉన్న పది మండలాలకు బెల్లంపల్లి ప్రధాన కేంద్రం. గ్రామీణులు కూరగాయలు పండించి రోజువారీగా బెల్లంపల్లి మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లోని పలు గ్రామాల సమీపంలో ఉన్న కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ నుంచి కూరగాయలు మార్కెట్‌కు వస్తుంటాయి. అయితే నెల రోజుల పైబడి నుంచి ఎండలు దంచి కొడుతుండటంతో ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడింది. పగటి ఉష్ణోగ్రత గరిష్టంగా 43డిగ్రీల నుంచి 45డిగ్రీలుగా నమోదు అవుతుండటంతో కూరగాయల ఉత్పత్తి సగానికి పడిపోయినట్లుగా తెలుస్తోంది. పాలీహౌజ్, గ్రీన్‌హౌజ్‌లు లేక అనాదిగా వస్తున్న సాధారణ సాగు పద్ధతుల్లో కూరగాయలు పండిస్తుండటంతో ఎండతీవ్రతకు పంటలు దెబ్బలు తిని ఎండాకాలంలో కూరగాయల ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి ఆకు కూరలు, బెండ, కొత్తిమీరు తప్పా ఇతర రకాల కూరగాయలు మార్కెట్‌కు రావడం లేదు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి...

గ్రామీణప్రాంతాల నుంచి కూరగాయల రాక తగ్గుముఖం పట్టడంతో హోల్‌సెల్ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లా అంకాపూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా మదనపల్లి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వ్యాన్‌లలో తీసుకువస్తున్నారు. రోజువారీగా 4 నుంచి 6వ్యాన్‌లలో కూరగాయలు వస్తున్నట్లుగా చెబుతున్నారు. ఎండల వల్ల స్థానికంగా కూరగాయల సాగు, ఉత్పత్తి పడిపోయి దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని హోల్‌సెల్ వ్యాపారులు మారుబేరం వ్యాపారులకు అప్పగిస్తున్నారు. దీంతో మారుబేరం వ్యాపారులు ఇంకాస్తా ధర పెంచి కొనుగోలు దారులకు విక్రయిస్తున్నారు. ఈ తీరుగా ఎండాకాలంలో కూరగాయలు చుక్కలకు తాకుతున్నాయి. వర్షాలు కురిసి స్థానికంగా కూరగాయలు ఉత్పత్తి అయ్యే వరకు ధరల తగ్గుదల ఉండే అవకాశాలు దాదాపు గగనమేనని మారుబేరం వ్యాపారులు పేర్కొంటున్నారు.

బెల్లంపల్లిలో కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)

కూరగాయలు	వారం క్రితం	ప్రస్తుతం
బీర	65	100
కాకర	50	70
అలసంద	40	70
పచ్చిమిర్చి	80	120
క్యారెట్	60	80
బీట్‌రూట్	60	80
చిక్కుడు కాయ	60	100
బెండకాయ	30	40
దొండకాయ	40	60
ములక్కాయ	60	80
తోట కూర	30	40
చుక్కకూర	40	50
క్యాబేజీ	40	60
వంకాయ	15	25
టమాట	40	50
కొత్తిమీర	10	(చిన్న కట్టకు)

ఇంకెంతకాలం భరించాలో...



నెల రోజుల నుంచి కూరగాయల ధరలు తగ్గత లేవు. దినదినం ధరలు పెరుగుతున్నాయే తప్పా నేల చూపులు చూడటం లేదు. ఆకు కూరల నుంచి తీరొక్క కూరగాయల వరకు ధర పెరిగాయి. చివరికి కొత్తిమీరు ధర కూడా పెంచి అమ్ముతున్నారు. ప్రతి ఇంట్లో కూరగాయలు తప్పనిసరికావడంతో ధర పెరిగినా కొనుగోలు చేయక తప్పడం లేదు. గిట్ల ఇంకెన్ని దినాలు తిప్పలు పడాలో అర్థమైతలేదు. ప్రభుత్వం పట్టించుకొని ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి.

\- చింతల బాలరాజు, కొనుగోలుదారుడు

బడి తరలింపునకు నిర్ణయం

- జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅర్బన్: 'సార్.. బడి తరలించరూ' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ స్పందించింది. స్థానిక హరిజనవాడ పాఠశాల భవనంలో మూడు పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో స్టేషన్ రోడ్ పాఠశాల తరలింపునకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు అనుకూలంగా ఉండే స్థానిక బాయ్స్ హైస్కూల్‌కు స్టేషన్‌రోడ్ పాఠశాల తరలింపునకు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆదేశించారు. ఒకే భవనం.. మూడు పాఠశాలలు.. ఇరుకైన గదుల్లో ఐదు తరగతులు.. దూర భారంతో ఆర్థిక ఇబ్బందులపై 'సాక్షి' కథనం ప్రచురించింది. పాఠశాల తరలింపునకు విద్యాశాఖ ఆమోదం తెలపటంతో విద్యార్థుల తల్లిదండ్రులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రాళ్లపేట్ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా రాళ్లపేట్ పాఠశాలను కూడా తరలించేందుకు విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

'రోడ్లపై పశువులను వదిలితే చర్యలు తప్పవు'

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి భీమారం మండల కేంద్రంలో రాత్రివేళ పశువులు వదిలితే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం ఎస్సై రాములు హెచ్చరించారు. రాత్రివేళ వేగంగా వెళ్లే వాహనాల డ్రైవర్లకి రోడ్లపై ఉంటున్న గేదెలు కనపడపోవడంతో, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో మరింత పెరిగాయన్నారు. పశువుల యజమానులు వాటిని ఇంటివద్దే ఉంచుకోవాలని కోరారు. పశువులను రోడ్లపై వదిలివేయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటికి వాటి యజమానులే బాధ్యత వహించాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రజలందరికీ ప్రభుత్వం తరుపున నాణ్యమైన ఉచిత మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంచిర్యాలకు తరలించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉండే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో వైద్యం అందేలా చేయడంతో పాటు, వచ్చే 50ఏళ్లను దృష్టిలో పెట్టుకుని, ఆసుపత్రుల నిర్మాణం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటాం

మంచిర్యాలటౌన్: తన తండ్రి కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న అంబలి పంపిణీ, చలివేంద్రాల ఏర్పాటు, చీరల పంపిణీ, రంజాన్ తోఫా వంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామని, ప్రజలకు అండగా నిలుస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. వేసవి దృష్ట్యా మంచిర్యాల నియోజకవర్గంలో 42రోజులుగా విజయవంతంగా కొనసాగించిన అంబలి, చల్లని తాగునీటి పంపిణీ కేంద్రాలు శనివారం చివరి రోజు కావడంతో ఆయనే జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో అంబలి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే బక్రీద్‌కు ముస్లింలకు తోఫా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటీవల దండేపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురైన ఉపాధిహామీ కూలీలకు తమ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించామని, పేద ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వార్డు కౌన్సిలర్లు మాదంశెట్టి సత్యనారాయణ, కొండ పద్మ, మెరుగు మహేశ్వరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

రూ.3లక్షల ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన మేకల సుమలతకు మెదడుకు సంబంధించిన చికిత్సకు రూ.3లక్షలు ఖర్చవుతుందని హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులు చెప్పారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.3లక్షల ఎల్‌వోసీ శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు'


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సతీశ్

నస్పూర్: రాబోయే వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ సూచించారు. పట్టణ పరిధిలోని 19వ వార్డులో శనివారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రెయినేజీలలోని చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వర్షాకాలం ప్రారంభం కాబోతున్న దృష్ట్యా డ్రెయినేజీలలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలిగించాలని, డ్రెయినేజీ వాటర్ రోడ్లపైకి, ఇళ్లలోకి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీలలో చెత్తాచెదారాన్ని వెంటవెంటనే తొలగించి డంపుయార్డుకు తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గల్ఫ్ కార్మికులు

జన్నారం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అనారోగ్యాలతో, ఇతర కారణాల వల్ల మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గల్ఫ్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మి కుల సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిగౌడ్, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు ఉన్నారు.

చేపలకు భలే గిరాకీ...!


కుమ్మరివాగు ప్రాజెక్టు వద్ద...


దండేపల్లి: చేపలు కొనుగోలు చేస్తూ...


గుడిపేట ప్రాజెక్ట్ వెళ్లే మూలమలుపు వద్ద...

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/భీమిని/నెన్నెల: మృగశిర కార్తె ప్రవేశం రోజున చేపలు తింటే మంచిదని ప్రజల నమ్మకం కాగా జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రజలు చేపలు కొనడానికి ఆసక్తి చూపించారు. చెరువుల వద్ద, చేపల విక్రయాల వద్ద చేపల కొనుగోలుకు జనాలు ఎగబడిపోయారు. దీంతో చేపల దుకాణాల వద్ద సందడి కనిపించింది.

మెరుగు పడనున్న వైద్య సేవలు

- వేగంగా సాగుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు
- ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామంటున్న అధికారులు


నిర్మాణంలో వంద పడకల ఆసుపత్రి భవనం

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. చెన్నూర్ మండల కేంద్రంలో 50పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ అప్‌గ్రేడ్ కాకపోవడంతో సౌకర్యాలు మెరుగుపడలేదు, వైద్యుల సంఖ్య పెరగలేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఎంతైనా అవసరం. గత ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

60శాతం పనులు పూర్తి...

చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతేడాది మార్చి 15న ఆసుపత్రి భవన నిర్మాణం పనులకు అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.15 కోట్ల నిధులతో క్రిషి కన్స్‌ట్రక్చర్స్ సంస్థ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు చేపడుతున్నారు. మార్చి 2025 నాటికి పూర్తి కావాల్సి ఉండగా, ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి అవుతాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 60శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు...

చెన్నూర్ పట్టణంలో ఇప్పటికే 50పకడల ఆసుపత్రి పూర్తయి రోగులకు సేవలందుతున్నాయి. రోగులు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తితే మంచిర్యాల, కరీంనగర్ లాంటి పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే చెన్నూర్‌తో పాటు కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలకు మెరుగు పడనున్నాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

50 పడకల ఆసుపత్రిని...

గతంలో ప్రతిపాదించిన మాదిరిగా 50పడకల ఆసుపత్రిని మాతా శిశు ఆసుపత్రిగా మార్చినట్లైతే మహిళలకు, శిశువులకు వైద్య సేవలు అందనున్నాయి. వంద పడకల ఆసుపత్రిలో అన్ని రకాల రోగులకు వైద్య సేవలందిస్తే ఈ ప్రాంత ప్రజలు వైద్యం కోసం పట్టణాలకు పరుగులు పెట్టాల్సి అవసరం ఉండదని ఈ ప్రజలంటున్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ మేరకు ఆలోచన చేస్తే నిరుపేదలకు మేలు జరుగుతుంది.

త్వరగా పనులు చేయాలి



వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. పెద్ద ఆసుపత్రి పూర్తయితే వైద్యులు, సిబ్బంది సంఖ్యతో పాటు సౌకర్యాలు పెరుగుతాయి. ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మెరుగు పడుతాయి. నిరుపేదలకు మేలు జరుగుతుంది.

\- సామల మోహన్, చెన్నూర్

ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తాం

పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 60శాతం పనులు పూర్తయ్యాయి. అగ్రిమెంట్ ప్రకారం వచ్చే ఏడాది మార్చి వరకు పూర్తి చేయాల్సి ఉంది. గడువుకు ముందే పూర్తయ్యేలా పనులు జరుగుతున్నాయి. వర్షాలు పడితే లోపలి పనులు నడుస్తాయి. ప్రస్తుతం నడుస్తున్న పనుల ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి నిర్మాణం పనులు పూర్తి చేయిస్తాం.

\- ముజీబ్, టీఎస్ఎంఐడీసీ, ఏఈ

విద్యుత్ ఆక్సిజన్ యంత్రం అందజేత


దాతను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నూక శంకర్‌లీలా దంపతులు స్థానిక సాయి వృద్ధాశ్రమానికి విద్యుత్ ఆక్సిజన్ యంత్రాన్ని అందజేసి ఉదారతను చాటుకున్నారు. చెన్నూర్ పట్టణంలో విద్యుత్ ఆక్సిజన్ యంత్రం లేకపోవడంతో రోగులు, వృద్ధుల ఇబ్బందులను గుర్తించి శంకర్‌లీలా దంపతులు అంత్యంత ఖరీదైన విద్యుత్ ఆక్సిజన్ యంత్రాన్ని అందజేశారని నిర్వాహకులు తెలిపారు. వృద్ధాశ్రమానికి విద్యుత్ ఆక్సిజన్ యంత్రాన్ని అందజేసిన దాత శంకర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పుల్లూరి సత్తయ్య, గర్రెపల్లి వెంకటనర్సయ్య, మంచాల వెంకన్న, మల్లిక్, గన్ను పాండురంగం పాల్గొన్నారు.

నియామకం


పున్నం

కోటపల్లి: మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా సిర్సా గ్రామానికి చెందిన పెద్దింటి పున్నంను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ తెలిపారు. మున్నూరుకాపు సంఘం ఆదేశాల మేరకు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని మండల అధ్యక్షుడు పున్నం తెలిపారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పున్నంను కులపెద్దలు, సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పాఠ్య పుస్తకాలు వచ్చాయోచ్..!


పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలు

బెల్లంపల్లి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. బెల్లంపల్లి మండలంలో శుక్రవారం పుస్తకాలు సరఫరా కాగా, వెను వెంటనే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు 80శాతం వరకు వచ్చాయి. మరో 20శాతం పుస్తకాలు రెండో విడతలో సరఫరా కానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా తరగతులకు సంబంధించి మొత్తం 18,751 పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకోగా వీటిని ఎంఈవో మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఆయా తరగతులకు సంబంధించి కొన్ని సబ్జెక్టుల పుస్తకాలు సరిపడినంతగా రానట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేసి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా పాఠ్య పుస్తకాలు వచ్చినంతలో ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని ఎంఈవో మహేశ్వర్ రెడ్డి తెలిపారు.